క్లుప్తంగా

అల్లూరి జయంతి ఏర్పాట్లు పరిశీలన



అల్లూరి పార్కులో ఏర్పాట్లు పశీలిస్తున్న డీఎస్పీ

గొలుగొండ : మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 128 జయింతి వేడుకలు ఏర్పాట్లను నర్సీపట్నం డీఎస్పీ పి.శ్రీనివాసరావు గురువారం పరిశీలించారు. పార్కులో శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం అల్లూరి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించడం కోసం ఏర్పాట్లు చేయడం జరిగింది. దీని కోసం పార్కును అందంగా తీర్చిదిద్దారు. అల్లూరి ఉత్సవ కమిటీ, టూరిజం శాఖ సంయుక్తంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని నర్సీపట్నం రూరల్ సీఐ రేవతమ్మ, ఎస్ఐ తారకేశ్వర్రావుకు డీఎస్పీ ఆదేశాలు జారీ చేశారు.

పాఠశాలలో గ్రామసభ



సభలో మాట్లాడుతున్న ఎంఈవో మూర్తి

మాకవరపాలెం: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించాలంటూ ఎంఈవో మూర్తి గ్రామసభ నిర్వహించారు. మండలంలోని రామన్నపాలెం శివారు వెంకయ్యపాలెం ప్రాథమిక పాఠశాలలో ఒకే విద్యార్థి ఉండడంతో గురువారం స్థానికులతో ఎంఈవో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అందిస్తున్న పథకాలను తెలియజేశారు. విద్యార్థులను ఈ పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు.

ఆర్టీసీ పార్శిల్ సేవలు ప్రారంభం

మాకవరపాలెం: ఆర్టీసీ పార్శిల్ సేవలను ప్రారంభించినట్టు నర్సీపట్నం ఆర్టీసీ డిపో మేనేజర్ ధీరజ్ గురువారం తెలిపారు. మండల కేంద్రంలోని పాత పోస్టాఫీస్ వద్ద పార్శిల్ సేవలతోపాటు హైదరాబాద్, విజయవాడ, భద్రాచలం, తదితర దూర ప్రాంతాలకు బస్సుల్లో ప్రయాణించే వారు టికెట్లను బుక్ చేసుకోవచ్చన్నారు. వివరాలకు 8897989685 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

తాగునీరు క్లోరినేషన్ చేయాలి



తాగునీటిలో బ్లీచింగ్ వేయిస్తున్న ఎంపీడీవో చాయాసుధ

మాకవరపాలెం: క్లోరినేషన్ చేసిన తాగునీటిని ప్రజలకు అందించాలని ఎంపీడీవో చాయాసుధ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. మండలంలోని జంగాలపల్లి, పి.పి.అగ్రహారం, నారాయణరాజుపేటలో ఆమె గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా తాగునీటి సరఫరా, పారిశుధ్యంపై ఆరాతీశారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పారిశుధ్యంపై దృష్టి సారించాలన్నారు. అలాగే తాగునీటిని క్లోరినేషన్ సరఫరా చేయాలన్నారు. తాగునీటిలో బ్లీచింగ్ కలిపించారు. అనంతరం చెత్త సంపద కేంద్రాలను సందర్శించి, వీటి నిర్వహణపై నిర్లక్ష్యం చేయొద్దన్నారు. ఆమె వెంట ఆయా పంచాయతీల కార్యదర్శులు ఉన్నారు.


ఘనంగా మరిడిమాంబ పండగ



అమ్మవారికి మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

రావికమతం; చినపాచిల గ్రామంలో మరిడిమాంబ అమ్మవారి పండగను గురువారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు భారీగా తరలి వచ్చి పసుపు, కుంకుమ, సారె ఇచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు



చిన్నారులకు చికిత్సలు చేయిస్తున్న అంగన్‌వాడీ టీచర్ వరలక్ష్మి

రోలుగుంట: మండలంలో కంచుగుమల అంగన్‌వాడీ కేంద్రంలో గల చిన్నారులకు అంగన్‌వాడీ టీచర్ సిహెచ్.వరలక్ష్మి నెలవారీ ఆరోగ్య పరీక్షలు చేయించారు. ఆరోగ్య పరీక్షలు చేసిన ఏఎన్ఎం. చిన్నారులకు అవసరమైన మందులు ఉచితంగా పంపిణీ చేసి ఆరోగ్య సూచనలు చేశారు. ప్రధానంగా చిన్నారులకు ఇస్తున్న పోషకాహారంలో జాగ్రత్తలు పాటించాలని, చిన్నారులకు ఆహారం తీసుకునే ముందు చేతులు నీటితో పరిశుభ్రం చేయించి, తాగేందుకు కాచి చల్లార్చిన నీరు సరఫరా చేయాలని సూచించారు.

ఆగాకరతో సిరుల సాగు

ఆగాకర సాగు ధరలు అదుర్స్. ఎన్నడూ లేని విధంగా గిటుబాటు ధరలతో రైతులు సిరుల పంటగా మారింది. ఈ ఏడాది సాగు చేస్తున్న రైతులకు మంచి లాభాలు వస్తున్నాయి. సీజన్ ప్రారంభంలో కిలో రూ.180 అమ్మడం ఇదే మొదటిసారి. జిల్లాలో ఆగాకర సాగుకు పెట్టింది పేరు గొలుగొండ. సుమారుగా 800 ఎకరాల్లో సాగు జరుగుతుంది. మెట్టప్రాంతాలు, ఎర్ర నేలలు అనుకూలంగా ఎక్కువగా ఉండటంతో పందిరి సాగుతో రైతులు పంట పండిస్తున్నారు.



రాజుపేటలో సాగు జరుగుతున్న ఆగాకర పందిరిసాగు

- రైతులకు గిట్టుబాటు ధరలు
- మెట్ట ప్రాంతాలు, ఎర్రనేలల పంటకు అనుకూలం
- మండలంలో 800 ఎకరాల విస్తీర్ణంలో సాగు



రైతుల వద్ద కొనుగోలు చేసిన ఆగాకర కాయలు

గొలుగొండ : గొలుగొండ మండలంలో ఈ సాగు ఎక్కువగా జరుగుతుంది. మండలంలో ఈ సాగుకు అనుకూలమైన నేలలు అధికంగా ఉండడంతో ఈ సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఎర్ర నేలలు, మెట్ట ప్రాంతాలు, కొండపోడు భూముల్లో సుమారుగా 800 ఎకరాల వరకు సాగు జరుగుతుంది. మండలంలో ఎర్రవరం, కొత్త ఎల్లవరం, రాజుపేట, పప్పుశెట్టిపాలెం, కరక, దోనిపాలెం, వడపర్తి, జమ్మవరం తదితర 40 గ్రామాల్లో ఈ సాగు విస్తారంగా జరుగుతోంది.

ఆగాకర గతంలో కొండ భూముల్లో పంట పండేది. సహజసిద్ధంగా వచ్చిన పంటను గిరిజన ప్రజలు మైదానంలోనికి తీసుకువచ్చి అమ్మకాలు చేసేవారు. కానీ ఈ తరహా సాగు ఇప్పుడు లేదు. రైతులు గత ఏడాది సాగులో విత్తనాలు తయారు చేసుకొని వాటిని ఈ ఏడాది వేసుకొని పంటలు సాగు చేయడం గత 10 సంవత్సరాలు నుండి జరుగుతుంది. ఏప్రిల్‌లో మండు వేసవిలో విత్తనాలు పెట్టి పందిర్లు వేసి వాటికి ప్రతీరోజు నీరు పోసి సాగు చేస్తున్నారు. పాదులకు వేసవిలో నీరు పోసి సాగు చేయడం వల్ల జులై, ఆగస్టు నెలలో కాపునకు వస్తుంటాయి. పందిరి సాగు వల్ల అధిక దిగుబడి, కాయల నాణ్యత వల్ల ఆదాయం బాగుంది.

అధికంగా ఇతర రాష్ట్రాలకు ఎగుమతి

ప్రస్తుతం గొలుగొండ మండలంలో సాగు జరుగుతున్న ఆగారక విశాఖ, విజయవాడ, రాజమండ్రి పట్టణాలతో పాటు ఒడిశా, బెంగాల్, తమిళనాడు ప్రాంతాలకు వాహనాలపై ఎగుమతి అవుతోంది. అక్కడ ఈ పంటకు మంచి డిమాండ్ ఉండడంతో వ్యాపారులు నుండి వీటిని కొనుగోలు చేసి ఇతర ప్రాంతాల్లో అమ్మకాలు చేస్తున్నారు. ఇలా ప్రతి ఏటా సాగు చేస్తున్న రైతులు విస్తీర్ణం పెంచుతున్నారు.

ఎకరానికి రూ.40వేల వరకు పెట్టుబడి

ఈ సాగుకు పెట్టుబడులు ఎక్కువవగా ఉంటాయి. వేసవిలో పాదులకు నీరు పోసే సమయంలో కూలీలకు అధికంగా పెట్టుబడులు అవుతున్నాయి. అలాగే పందిరి సాగుకు కావాల్సిన కర్రలు, తాళ్లు ఇతర ఖర్చులతో కలిపి రూ.40వేల వరకు ఖర్చు అవుతుందని రైతులు తెలుపుతున్నారు. ఎకరానికి ధరలు బాగుంటే రూ.1.50 లక్షల వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉంది.

ప్రస్తుతం కిలో ధర రూ.180

ప్రస్తుతం ఆగాకర పంట రైతులు వద్ద వ్యాపారులు కిలో రూ.180కి కొనుగోలు చేస్తున్నారు. కాపు మొదటి దశలో గత ఏడాది రూ.130 అమ్మకాలు కాగా ఈ ఏడాది ధరలు అధికంగా ఉన్నాయి. ఇతర ప్రాంతాల్లో రూ.300 వరకు అమ్మకాలు జరుగుతున్నాయని తెలుపుతున్నారు. అధిక వర్షాల కారణంగా కొన్ని ప్రాంతాల్లో దిగుబడి తగ్గడంతో మొదటి దశలో ధరలు ఎక్కువగా ఉన్నట్టు వ్యాపారులు చెబుతున్నారు.

లాభాలు బాగున్నాయి...



పాదులకు కాపు అధికంగా ఉంటే ఈ ఏడాది మంచి లాభాలు వచ్చే అవకాశం ఉంది. మొదటిదశలో రూ.170 నుండి రూ.180 వరకు రైతులు నుండి వ్యాపారులు కాయలు కొనుగోలు చేస్తున్నారు. వర్షాల అధికంగా ఉండడం వలన కొన్ని ప్రాంతాల్లో కాపు తక్కువగా ఉంది. ఇక్కడ పండిన పంటను ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు.

– రమణ, రైతు యల్లవరం

ఖరీఫ్ సాగుకు సర్వం సిద్ధం



ఏడీఏ టి.శ్రీదేవి

నర్సీపట్నం: వచ్చే ఖరీఫ్ సాగుకు డివిజన్‌లో సర్వం సిద్ధం చేసినట్టు నర్సీపట్నం ఏడీఏ టి.శ్రీదేవి పేర్కొన్నారు. సబ్ డివిజన్ పరిధిలో సాధారణ విస్తర్ణం 11,799 హెక్టార్లలో వరిపంట సాగయ్యే అవకాశాలున్నాయన్నారు. ఈ ఏడాది ఆశాజనకంగా వానలు కురవడంతో సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉందన్నారు. సబ్ డివిజన్ పరిధిలో ఖరీఫ్ సాగుకు ప్రభుత్వం విత్తనాలను కేటాయించిందన్నారు. బయోమెట్రిక్ విధానంలో రైతులకు విత్తన పంపిణీకి అధికారులు చర్యలు చేపట్టారన్నారు. సోనా మసూరి 30 కిలోలకు రూ.300 రాయితీపై రూ.960, శ్రీకాకుళం సన్నాలు రాయితీ రూ.300 కాగా రూ.990, సాంబ మసూరి 25 కిలోలకు రాయితీ రూ.250 కాగా రూ.825, స్వర్ణ 30 కిలోలకు రాయితీ రూ.300 కాగా రూ.960, ఇంద్ర రాయితీ రూ.300 కాగా రూ.960, అమర రాయితీ రూ.300 కాగా రూ.960, మార్టేరు సాంబ 25 కిలోలకు రాయితీ రూ.300 కాగా రూ.800, నెల్లూరు మసూరి 30 కిలోలకు రాయితీ రూ.300 కాగా రూ.960, ఎంటీయు 1262 మార్టేరు మసూరి 30 కిలోలకు రాయితీ రూ.300 కాగా రూ.960 చొప్పన రైతులకు పంపిణీ చేస్తున్నామన్నారు. రైతులు బ్యాగ్ ఓపెన్ చెయ్యకుండా వంద గింజలు మొలక కట్టి 80 గింజలు మొలక కట్టినట్టయితే విత్తనాలను పొలంలో వేయాలన్నా రు. తక్కువ గింజలు మొలక కట్టినట్టయితే పది రోజుల లోపు బ్యాగ్ టాగ్‌తో తిరిగి ఇచ్చేస్తే మరల బ్యాగ్ తెప్పించి ఇవ్వడం జరుగుతుందన్నారు.

నూతన డీటీ బాధ్యతల స్వీకారం

బుచ్చెయ్యపేట : మండల డిప్యూటీ తహసీల్దారుగా యలమంచిలి శ్రీరామ్మూర్తి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆయన అనకాపల్లి ఆర్డీఓ కార్యాలయం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ డీటీగా పనిచేస్తున్న మురళి మునగపాక తహసీల్దారు కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. నూతన డీటీ శ్రీరామ్మూర్తికి స్థానిక వీఆర్‌ఓలు, వీఆర్‌ఏలు శుభాకాంక్షలు తెలిపారు.

ఆదర్శ పాఠశాలలో స్పెషల్ డ్రైవ్



విద్యార్థులు, ఉపాధ్యాయులతో ఎంఈవో వరహాలబాబు

నాతవరం : మండల కేంద్రంలో గల అదర్శ పాఠశాలలో ఈ ఏడాది స్పెషల్ డ్రైవ్ ద్వారా 100 మంది పైగా విద్యార్థులను చేర్చుకున్నామని ఎంఈవో కామిరెడ్డి వరహాలబాబు అన్నారు. ఆయన గురువారం పాఠశాల ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి కొత్తగా వచ్చిన నిబంధనలు అనుసరించి బాధ్యతగా పని చేయాలన్నారు. మధ్యాహ్న భోజనం మెనూ అమలు విషయంలో నిర్లక్ష్యం చేయరాదన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చిన పుస్తకాలు యూనిఫామ్‌లు విద్యార్థులకు పంపిణీ చేశామన్నారు. ఇంకా బూట్లు, బ్యాగ్‌లు రావలసి ఉందన్నారు. స్పెషల్ డ్రైవ్ ద్వారా పాఠశాలలో విద్యార్థులను జాయిన్ చేసిన ఉపాధ్యాయులను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యా కమిటీ చైర్మన్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు, వేతనాలు చెల్లించాలి



ఎంఈవోకు వినతిపత్రం అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు

చోడవరం : మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు పెండింగ్‌లో ఉన్న బిల్లులు, వేతనాలను ఇవ్వాలని యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు గూనూరు వరలక్ష్మి కోరారు. చోడవరంలో ఎంఈవో లక్ష్మణరావుకు మధ్యాహ్న భోజన నిర్వాహకులతో కలిసి గురువారం ఆమె వినతిపత్రాన్ని అందించారు. గత మార్చి నుంచి ఇంత వరకూ బిల్లులను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయలేదన్నారు. నిర్వాహకులు అప్పుల ఊబిలో కూరుకుపోవడంతో పాటు మానసిక ఆవేదన పడుతున్నట్టు తెలిపారు. తమ సమస్యలపై వచ్చే నెల 9న సమ్మె చేస్తున్నట్టు వినతిపత్రంలో తెలిపారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన నిర్వాహకులు బుచ్చిరాజమ్మ, చింతల్లి, లక్ష్మి, దేవి, వరలక్ష్మి పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మె గోడపత్రిక ఆవిష్కరణ



కె.కోటపాడులో గోడపత్రికను విడుదల చేస్తున్న సీపీఎం నాయకులు

కె.కోటపాడు : ఈ నెల 9న నిర్వహిస్తున్న దేశ వ్యాప్త సమ్మెలో అన్ని వర్గాల ప్రజలతో పాటు కార్మికులు, కర్షకులు పెద్ద సంఖ్యలో పాల్గొని సమ్మెను విజయవంతం చేయాలని సీపీఎం మండల నాయకుడు యర్రా దేముడు అన్నారు. కె.కోటపాడులో గురువారం అసంఘటిత రంగంలో పని చేస్తున్న ఉద్యోగులతో కలిసి ఆయన సమ్మెకు సంబంధించిన గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యర్రా దేముడు మాట్లాడుతూ అసంఘటిత రంగంలో పనిచేస్తున్న వారికి సమగ్ర చట్టాన్ని చేయాలని, భవన నిర్మాణ రంగంలో కార్మికుల అందరికీ సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. కూటమి ప్రభుత్వం రైతుల పంటలకు గిట్టుబాటు ధరలను ప్రకటించాలని, బీసీలకు 50 ఏళ్లకే పింఛను అందిస్తామన్న హామీని వెంటనే అమలు చేయాలని యర్రా దేముడు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఈర్లె నాయుడు బాబు, రొంగలి ముత్యాలనాయుడు పాల్గొన్నారు.

మార్కెట్ సేవలు రైతులకు చేరువ



మార్కెట్ యార్డు చైర్మన్ వెంకట రమణ

నర్సీపట్నం: వ్యవసాయ మార్కెట్ సేవలను రైతులకు మరింత చేరువ చేసేందుకు కార్యచరణ రూపొందిస్తున్నామని మార్కెట్ కమిటీ చైర్మన్ గవిరెడ్డి వెంకట రమణ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రైతులు పండించిన ఉత్పత్తులను మార్కెట్ యార్డుకు తెచ్చుకుని క్రయ విక్రయాలు జరుపుకొనేందుకు అవసరమైన సౌకర్యాలను అందుబాటులోకి తీసుకువస్తున్నామన్నారు. మార్కెట్‌లో మూతపడిన భూసార పరీక్ష కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకువస్తున్నామన్నారు. మార్కెట్ యార్డు పరిధిలో నడుస్తున్న రైతు బజార్ సముదాయంలోని దుకాణాలను పండించిన కూరగాయాలు అమ్ముకునేందుకు రైతులకు కేటాయిస్తున్నామన్నారు.

రామావతారంలో జగన్నాథుడు



మాడుగుల: జగన్నాథ రథోత్సవాలులో బాగంగా జగన్నాథుడు భక్తులకు గురువారం రామావతారంలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. తెల్లవారు నుంచి అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. సాయంకాలం ఇంద్రజ్యుమ్నం ప్రాంగణంలో హరిభజనలు నిర్వహించారు.

చోడవరం: శ్రీజగన్నాథస్వామి దశావతారాల్లో భాగంగా శ్రీరాముడి అవతారంలో స్వామివారు గురువారం భక్తులకు దర్శన మిచ్చారు. చోడవరం కేశవస్వామి ఆలయంలోని ఉపాలయంలో వేంచేసి యున్న బలభద్రుడు, సుభద్ర సమేతుడైన జగన్నాథస్వామికి రథోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఆరవ రోజున స్వామివారు శ్రీరాముడి అవతారంలో భక్తులకు దర్శన మిచ్చారు.

గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపర్చాలి



ఎం. కోడూరులో పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ అప్పారావు, కార్యదర్శి ప్రసాదు



రావికమతంలో పర్యటించిన డిప్యూటీ ఎంపీడీవో

మాడుగుల రూరల్: గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు ప్రజలు సహకరించాలని ఎంపీడీవో కొంకి అప్పారావు పేర్కొన్నారు. ఎం. కోడూరు గ్రామంలో గురువారం ఆయన పంచాయతీ కార్యదర్శి డి. ప్రసాదుతో కలిసి పారిశుధ్య పనులు పరిశీలించారు. చెత్తాచెదారం రోడ్డు పైనా, మురుగుకాల్వల్లో వేయవద్దని గ్రామస్తులకు సూచించారు. సంపద కేంద్రాన్ని సందర్శించారు.

రావికమతం: పారిశుధ్య పనులపై అన్ని గ్రామ పంచాయతీల్లో ఐవీఆర్ఎస్ ద్వారా సర్వే చేస్తుందని డిప్యూటీ ఎంపీడీవో స్వామి తెలిపారు. గురువారం ఆయన రావికమతం, గుడ్డిప, తట్టబంద పంచాయతీల్లో పర్యటించి పారిశుధ్య పనులు పరిశీలించారు. పారిశుధ్యంపై ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే సిబ్బంది పై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

తూతూమంత్రంగా 'తొలి అడుగు'



కొత్తపెంటలో ఏడాదిగా వితంతు ఫించన్ మంజూరు కాలేదని ఎమ్మెల్యే బండారుకు చెబుతున్న దేముడమ్మ

దేవరాపల్లి: మండలంలో కొత్తపెంట, ములకలాపల్లి గ్రామాలలో గురువారం నిర్వహించిన సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి టీడీపీ తలపెట్టిన సుపరిపాలనకు తొలి అడుగు తూతూ మంత్రంగా సాగింది. ఇంటింటా పర్యటనను కాస్తా ప్రధాన వీధులకు మాత్రమే పరిమితం చేశారు. ప్రజా సమస్యలను తెలుసుకోవడం కంటే కార్యకర్తలతో సమావేశానికే ప్రాధాన్యమిచ్చారు. ఈ నేపథ్యంలోనే తన భర్త మరణించి ఏడాది దాటి పోతున్నా తనకు వితంతు పింఛను మంజూరు చేయలేదని కొత్తపెంటకు చెందిన చిరికి దేముడమ్మ ఎమ్మెల్యేను కోరగా త్వరలోనే మంజూరవుతుందని చెప్పి వెళ్లిపోయారు. తన భర్త మరణించినప్పటికీ తనకు పింఛను మంజూరు కాలేదని చీపురుపల్లి లూసీ ఎమ్మెల్యేను కోరింది. కొత్తపెంట చెరువు గట్టు నుంచి వడ్రపాలెం రోడ్డు వరకు గ్రావెల్ రోడ్డు నిర్మించాలని రైతులు, ఉచిత గ్యాస్ నగదు తమకు రాలేదని పలువురు రైతులు ఎమ్మెల్యేకు తెలిపారు.

మాడుగుల : మండలంలో జంపెన వొమ్మలి గ్రామాల్లో గురువారం సుపరిపాలనలో భాగంగా క్లస్టర్ ఇన్‌చార్జి పుప్పాల రమేష్ ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరిగి తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

కెనరాబ్యాంకు ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం



వరాహపురం హైస్కూల్లో మొక్కలు నాటుతున్న దృశ్యం

చీడికాడ : కెనరా బ్యాంకు స్థాపించి నేటికి 120 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా, జె.బి.పురం కెనరా బ్యాంకు బ్రాంచ్ వారి సారథ్యంలో గురువారం పాఠశాలలో మొక్కలు నాటారు. గ్రామంలో జిల్లా పరిషత్ హైస్కూలు, ఎంపీపీ పాఠశాలతో పాటు గ్రామ సచివాలయం, గ్రామంలో రహదారి కిరువైపులా సుమారు 150 మొక్కలు నాటారు. బ్యాంకు మేనేజర్ కూర్మారావు సారథ్యంలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ గొల్లవిల్లి చిన్నమ్మలు, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు, వైస్ ఎంపీపీ ధర్మిశెట్టి స్వాతి కొండబాబు, తునివలస సర్పంచ్ పడాల హైమ, శ్రీను, పాఠశాల హెచ్‌ఎం దేముడుబాబు, స్కూలు కమిటీ చైర్మన్ అప్పారావు పాల్గొన్నారు.

హోల్‌సేల్ కాయగూరల మార్కెట్లో వసతులు కరువు



విలేకర్లతో మాట్లాడుతున్న ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు రమణ



దేవరాపల్లిలో హోల్‌సేల్ కాయగూరల మార్కెట్‌లో జోరువానలో తడుస్తున్న రైతులు

దేవరాపల్లి : దేవరాపల్లి హోల్‌సేల్ కాయగూరల మార్కెట్లో కనీస సౌకర్యాలు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు కె.వి.రమణ ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక రైతులతో కలిసి ప్రభుత్వ హైస్కూల్ వద్ద గల హోల్‌సేల్ కాయగూరల మార్కెట్‌ను గురువారం సందర్శించారు. మార్కెట్ నుంచి ఆశీల రూపంలో పంచాయితీకి రూ.లక్షల్లో ఆదాయం వస్తున్నా కనీస వసతులు కల్పించక పోవడం దారుణమన్నారు. కనీసం రేకుల షెడ్ నిర్మించక పోవడంతో రైతులు ఎండకు ఎండి, వానకు తడిసి ముద్దవుతున్నారని అన్నారు. కనీసం తాగునీటి సౌకర్యం కల్పించక పోవడం రైతుల పట్ల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. ఇప్పటికైనా పంచాయతీ పాలకవర్గం, అధికారులు స్పందించి మార్కెట్లో రైతులకు కనీస సౌకర్యాలు కల్పించాలని లేకుంటే సమస్యను రైతుల తరఫున జిల్లా కలెక్టర్, వ్యవసాయశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్తానని రమణ అన్నారు.

ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు

నర్సీపట్నం : అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ రహిత దినోత్సవం సందర్భంగా మున్సిపాలిటీ పరిధి బలిఘట్టం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థులతో ఉపాధ్యాయులు ప్లాస్టిక్ నిషేధంపై ప్లకార్డులు పట్టుకుని ర్యాలీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. సైన్స్ ఉపాధ్యాయులు శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్లాస్టిక్ బ్యాగ్, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించాలన్నారు. గుడ్డ, నారసంచులు వాడాలన్నారు. ప్లాస్టిక్ వాడకం వల్ల కేన్సర్ బారిన పడే అవకాశముందన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల భూమి, నీరు, గాలి, కాలుష్యం అవుతుందన్నారు. ప్లాస్టిక్ నిషేధంపై విద్యార్థులు తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు.

సమస్యల పరిష్కారానికి గ్రామసభలు దోహదం

మాడుగుల రూరల్: గ్రామాలల్లో సమస్యల పరిష్కారానికి గ్రామ సభలు దోహద పడతాయని కె.జె.పురం గ్రామ సర్పంచ్ జామి రమణబాబు అన్నారు. గురువారం స్థానిక గ్రామ సచివాలయంలో గ్రామ సభ ఏర్పాటు చేశారు. పారిశుధ్యం, తాగునీరు, వీధి దీపాల సమస్యలు, ఈ నెల 20 న జరిగే మోదమాంబ జాతర సందర్భంగా గ్రామంలో పారిశుధ్య పనులను సమీక్షించారు. ఉపాధి హామీ పనుల గురించి చర్చించారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శి బి.నవీన్‌దొర, ఉప సర్పంచ్ సూరిశెట్టి గోవిందరాజులు, పంచాయితీ జూనియర్ సహాయకులు సత్యనారాయణతో పాటు సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

నర్సీపట్నం : విద్యుత్‌లైన్లపై చెట్ల కొమ్మలను తొలగించే నిమిత్తం శుక్రవారం పెదబొడ్డేపల్లి, బలిఘట్టం సబ్‌స్టేషన్ల పరిధిలోని విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎ.వి.ఎస్.ఎం.అప్పారావు తెలిపారు. ఈ రెండు సబ్ స్టేషన్ల పరిధిలో ఉన్న శ్రీరాంనగర్, ఇందిరా, రామారావు, బీసీ కాలనీలు, ఏఎస్‌ఆర్ నగర్, పాతలక్ష్మీపురం, రామలక్ష్మీపురం, బలిఘట్టం, బయపురెడ్డిపాలెం ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

మాడుగుల: సబ్‌స్టేషన్ నిర్వహణ కారణంగా మండలంలో అన్ని గ్రామాలకు శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈఈ అప్పారావు తెలిపారు.

చీడికాడ : విద్యుత్ మరమత్తు పనుల కారణంగా శుక్రవారం మండలంలో అప్పలరాజుపురం 33 కె.వి.విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో గల అప్పలరాజుపురం, ఖండివరం, కోనాం, మంచాల, శిరిజాం, యల్.బి.పట్నం, వీరభద్రుపేట, బి. సింగవరం, గ్రామాలకు శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మద్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈఈ అప్పారావు తెలిపారు.

బాలసదనంలో హెల్త్ స్క్రీనింగ్ క్యాంప్



స్క్రీనింగ్ నిర్వహించిన బాలసదనం విద్యార్థులతో బాలల సత్వర చికిత్స కేంద్రం వైద్యులు, వైద్య సిబ్బంది

నర్సీపట్నం: మిషన్ వాత్సల్యం పథకంలో భాగంగా జిల్లా సత్వర చికిత్స కేంద్రం వారు నర్సీపట్నం బీసీ కాలనీలోని బాలసదనంలో పిల్లలకు హెల్త్ స్క్రీనింగ్ క్యాంప్ శుక్రవారం నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ ఎం.హైమావతి, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎం.ఎస్తేర్‌రాణి ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్యులు క్యాంప్‌లో పాల్గొని పుట్టుకతో వచ్చే శారీరక, మానసిక లోపాలు, జనన లోపాలు, పోషకాహార లోపాలు, వ్యాధులపై విద్యార్థులు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి చికిత్స అందించారు. జిల్లా సత్వర చికిత్స కేంద్రానికి తరలించి పిల్లలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తామని ప్రోగ్రాం ఆఫీసర్ ఎస్తేర్‌రాణి తెలిపారు.